# కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

**నర్సాపూర్, మార్చి 28. ప్రభాతవార్త :** నర్సాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం మెదక్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు మల్లేశం కురుమ ఆధ్వర్యంలో కురుమ సంఘం సభ్యులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాజీ కౌన్సిలర్ గోడ రాజేందర్ తో కలిసి కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం కురుమ మాట్లాడుతూ నర్సాపూర్ అటవీ ప్రాంతంలో డంపు యార్డు నిర్మించినట్లయితే ఈ ప్రాంతమంతా కాలుష్యమయం అవుతుందన్నారు. దీంతో నల్లవల్లి, ప్యారా నగర్, నర్సాపూర్ ప్రాంత ప్రజలకు అనేక ఇబ్బందులు సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ డంప్ యార్డ్ తో ప్రజలకు ముప్పు వాటిల్లుతున్నందున ప్రభుత్వం వెంటనే ఈ డంపు యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకుడు మాజీ కౌన్సిలర్ గోడ రాజేందర్ తో పాటు కురుమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు మల్లేశం కురుమ, భాస్కర్, ఆంజనేయులు, మల్లేష్, ఆనంద్,సాయి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు .



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్

**నంగునూర్, మార్చి 28, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల యువతకు రాజీవ్ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.ఈ పథకాన్ని నిరుద్యోగ యవతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేటగిరి–1 కింద రూ. లక్ష రుణం అందించి 80 శాతం రాయితీ ఇస్తుందన్నారు.కేటగిరి–2 కింద లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను మంజూరు చేసి 70 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. కేటగిరి–3 కింద రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందించి 60 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. వచ్చేనెల 5 వరకు ఆన్‌లైన్‌లో అర్హులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సర్కారు పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు.



మంత్రి నుంచి నియామకం పత్రం అందుకుంటున్న సూర్యచంద్రవర్మ

# కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

## రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట రూరల్, మార్చి 28, ప్రభాతవార్త:** పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన ప్రాముఖ్యత ఉంటుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట పట్టణానికి చెందిన డీసీసీ ఓబిసి సెల్ అధ్యక్షులు డాక్టర్ సూర్యచంద్రవర్మను రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఆర్‌టిఎ) మెంబర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసి శుక్రవారం హైదారాబాద్‌లో నియామకంపత్రాన్ని అందజేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో బిసిలకు అవకాశాన్ని కల్పిస్తూ డాక్టర్ సూర్యచంద్రవర్మను ఆర్‌టిఎ మెంబర్‌గా నియమించినట్లు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఎ మెంబర్‌గా నియామకమైన డాక్టర్ సూర్యచంద్రవర్మ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో కష్టపడుతున్న ప్రతికార్యకర్తను గుర్తించి సరైన సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు.తనపై నమ్మకం ఉంచి ఆర్‌టిఎ మెంబర్‌గా నియమించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ సర్పంచుల బిల్లులు ఇవ్వకుంటే ఉద్యమ బాట

## -సిఎంకు ఉత్తరం రాసిన బిజెపి నేత అరుణ్ రాజ్



సిఎం రేవంత్ రెడ్డికి ఉత్తరం పంపుతున్న బీజేపీ నేత అరుణ్ రాజ్

**నారాయణఖేడ్, మార్చి 28 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ నియోజకవర్గ మాజీ సర్పంచుల 2019 నుండి 2024 వరకు గ్రామ పంచాయతీలలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని, సర్పంచుల కుటుంబ పరిస్థితులను నిలబెట్టాల్సిందిగా సిఎం రేవంత్‌రెడ్డికి పోస్టాఫీసు ద్వారా లేఖను శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఈసీ సభ్యులు అరుణ్‌రాజ్ పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచుల బిల్లులుఇవ్వకుంటే ఉద్యమాల బాటపడతామన్నారు. అందాల పోటీలకు బడ్జెట్ కేటాయించిన ముఖ్యమంత్రి రాష్ట్రం, గ్రామ పంచాయతీల అభివృద్ధిపైనా దృష్టిపెడితే ప్రజలు సంతోషించేవారని చెప్పారు. బిల్లులు తొందరగా ఇవ్వకుంటే మాజీ సర్పంచులు అప్పుల పాలై వాళ్ల కుటుంబాల పరిస్థితి అదోగతి పాలువుతుందన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, మార్చి 28, ప్రభాతవార్త:** రంజాన్ మత సామరస్యానికి, ఆత్మీయతకు ప్రతీక అని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రంజాన్‌మాసంలో ఉపవాసదీక్షలో ఉండే ముస్లిం సోదరులకోసం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం జోగిపేటలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ముస్లింలకు పవిత్రమాసమైనప్పటికీ, ఈ పండగ హిందు,ముస్లింలలో సోదరభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ విందులో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనుషులంతా సోదరభావంతో మెలగాలని సూచించారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపావాసదీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపావాసదీక్ష విడిపించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటి ఛైర్మెన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, ఆర్డీవో పాండు, తహశీల్దారు విష్ణుసాగర్, మైనార్టీ ప్రతినిధులు మీర్ గోహెర్‌ఆలి, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్ ఎండి గౌతమ్

**వెల్దుర్తి, మార్చి 28 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ధర్మారం గ్రామాన్ని గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్ రాష్ట్ర ఎండి గౌతమ్, గృహ నిర్మాణ శాఖ జిల్లా డిఎం మాణిక్యం, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం అయ్యారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, తహశీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎండి గౌతమ్

# ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి

## * ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభించాలి * సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి..

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సన్నద్ధం కావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియకి సంబంధించి జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్, అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 419 ధాన్యం కేంద్రాలలో తాలుతీసే, తేమశాతం కొలిచే యంత్రాలు, కాంటాలు, టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, తాగునీటి వసతి, ఎలక్ట్రిసిటి సౌకర్యాలను సమకూర్చుకోవాలన్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలుకేంద్రాలను ప్రారంభించాలన్నారు. ఈ యాసంగిలో 419 అన్ని కేంద్రాల్లో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దొడ్డు రకం కాకుండా సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని దళారులను నమ్మిమోసపొవద్దన్నారు. గ్రామాల్లో దొడ్డు, సన్నరకం ఎన్ని ఎకరాల్లో వేశారో.. ఎప్పుడు కోతకు వస్తాయో సంబంధిత వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.తేమ శాతం రాగానే వెంటనే గన్నిలలో లోడ్ చేసి గోదాములకు తరలించేందుకు సరిపడే లారీలను అందుబాటులో ఉంచుకోవాలని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌కు తెలిపారు. అకాల, రాళ్ల వానల బారిన పడకుండా కేంద్రాలలో తేమశాతం రాగానే వెంటనే లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్ అధికారులు వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేస్తే రెండు నుంచి మూడు రోజుల్లో రైతుల ఖాతాలలో డబ్బులు జమ అవుతాయన్నారు. జిల్లాలో బ్యాంకులలో ధాన్యం కొనుగోలు డబ్బుల జమలో ఇతరత్రా సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. మిల్లర్లు వెంట వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు.ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎస్ఓ తనూజ, డిఆర్‌డిఎ పిడి జయదేవ్‌ఆర్యా, సివిల్ సప్లైయి డిఎం ప్రవీణ్, ఆర్డీఓలు సదానందం, రామ్మూర్తి, చంద్రకళ, ఎసిపిలు మధు, పురుషోత్తం, సతీష్, ఎల్‌డిఎం హరిబాబు, డిఎం మార్కెటింగ్ నాగరాజు, డిఎవో రాధిక, రైస్ మిల్లర్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మానిక్

# దాడి చేసినవారిని వదిలి.. బాధితులపై కౌంటర్ కేసులా?

## కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమెల మానిక్

**జోగిపేట, మార్చి 28, ప్రభాతవార్త:** దాడికి పాల్పడిన సినీ నిర్మాత మురళీక్రిష్ణను అరెస్ట్ చేయకుండా బాధిలుపై అక్రమ కౌంటర్ కేసులు పెడతారా అంటూ కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమెల మానిక్ ప్రశ్నించారు. శుక్రవారం జోగిపేట దళిత సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత నాయకుడు పల్లె సంజీవయ్య కుటుంబ సభ్యులపై సినీ నిర్మాత మురళీక్రిష్ణ దౌర్జన్యం చేస్తూ హత్యాయత్నానికి పాల్పడి వారంరోజులైనా ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం దారుణమన్నారు. బాధితులు 12 మందిపై అక్రమకౌంటర్ కేసులు పెట్టారని, అందులో చనిపోయిన వ్యక్తిపైనా కేసు పెట్టారని, ఇది చూస్తే పోలీసుల విచారణ ఎవరిపక్షాన జరుగుతుందో అర్థమవుతుందన్నారు. దళితులకు ఎన్ని చట్టాలున్నా అవి పెత్తందారులకు చుట్టాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ నిర్మాత మురళీక్రిష్ణ రైతుల వద్ద భూములను లీజుకు తీసుకొని, అవి తిరిగి ఇవ్వకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. మురళీక్రిష్ణపై గతంలోనే పలు కేసులున్నా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. మురళీక్రిష్ణకు పిడి యాక్టు వర్తింపచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మురళీక్రిష్ణ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా కార్యదర్శి డి.విద్యాసాగర్, దళితసంఘాల సీనియర్ నాయకులు సంటెనోళ్ల సంజీవయ్య, నాయకులు దుర్గయ్య, ప్రసాద్, మోహన్, కరుణాకర్, ప్రశాంత్, పల్లె క్రిష్ణ, పల్లె అరున్ తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి మల్లన్న 21 రోజుల హుండీ

# ఆదాయం రూ.1,11,96,965 నగదు

**కొమురవెల్లి, మార్చి 28, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి హుండీలను శుక్రవారం ఆలయ అవరణలో లెక్కించారు. 21 రోజులకుగానూ స్వామివారి ఆదాయం రూ.1,11,96,965 నగదు వచ్చినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. 112 గ్రాముల మిశ్రమ బంగారం, 009 కిలో 200 గ్రాముల మిశ్రమ వెండి, 24 విదేశీ కరెన్సీలతో పాటు 20 క్వింటాళ్ల మిశ్రమ బియ్యం లభించినట్లు వివరించారు. కార్యక్రమంలో హుండీ లెక్కింపుల శివ రామకృష్ణ భజన మండలి సేవా సభ్యులు, మెదక్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ధర్మకర్తలు కొప్పరపు జయప్రకాష్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, మామిడాల లక్ష్మి, పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, సురేందర్, ఆలయ అర్చకులు,సిబ్బంది, టిజిబి బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గీతం విద్యార్థులు

# విజయవంతంగా ముగిసిన జాతీయ కార్యశాల

## ఎంతో నేర్చుకున్నామన్న ప్రతినిధులు

**పటాన్‌చెరు, మార్చి 28,ప్రభాతవార్త:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మార్చి 26 నుంచి 28 వరకు పదార్థాల నిర్మాణ విశ్లేషణ కోసం ఎక్స్ రే విక్షేపం (ఎక్స్ రే డిఫ్రాక్షన్ ఫర్ స్ట్రక్చరల్ అనాలిసిస్ ఆఫ్ మెటీరియల్స్) అనే అంశంపై మూడు రోజుల జాతీయ వర్క్ షాపును విజయవంతంగా నిర్వహించింది. ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించి, దేశం నలుమూలల నుంచి తరలివచ్చి, ఇందులో పాల్గొన్న ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యశాల ఎక్స్ రే డిఫ్రాక్షన్ (ఎక్స్ఆర్డీ) పద్ధతుల లోతైన అన్వేషణను అందించింది. నిపుణుల ఉపన్యాసాలతో పాటు ఆచరణాత్మక శిక్షణ జతకలిసి, ఇందులో పాల్గొన్న వారికి నిర్మాణాత్మకవిశ్లేషణలో అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం చేసింది. ఐఐటీ హైదరాబాదులోని మెటీరియల్స్ సైన్స్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రఖ్యాత విద్యావేత్త ప్రొఫసర్ రంజిత్ రామదురై ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త, శిక్షకుడిగా వ్యవహరించారు. ఎక్స్ రే డిఫ్రాక్షన్, డిఫ్రాక్టోమీటర్ జ్యామితి, అధునాతన పీక్ విశ్లేషణ పద్ధతుల యొక్క ప్రాథమిక సూత్రాలను ఆయా ప్రతినిధులు తెలుసుకున్నారు. దీనికి అదనంగా, ఎక్స్ఆర్డీ డేటాను వివరించడానికి అవసరమైన స్ట్రక్చరల్ రిఫైన్మెంట్ టూల్స్, సాఫ్ట్‌వేర్‌లపై ఆచరణాత్మక అనుభవాన్ని పొందారు. ఈ మూడు రోజుల నిర్విరామ కార్యక్రమంలో ప్రతినిధులందరినీ ఉత్సాహంగా ఉంచడమే గాక, ఎంతో విలువైన సమాచారాన్ని, బోధనానుభవాన్ని అలుపెరగకుండా పంచిన ప్రొఫెసర్ రంజిత్ రామదురైని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా దుశ్వాలువ, జ్ఞాపికలను ఇచ్చి సత్కరించారు. నిర్మాణాత్మక, ప్రభావవంతమైన అభ్యాస అనుభవాన్ని అందించిన ఈ కార్యశాలను భౌతిక శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ కె.విజయానందిని, డాక్టర్ సయాన్ చౌదని సమన్వయం చేయశారు.మూడు రోజుల కార్యశాలలో దేశవ్యాప్తంగా పలువురు పరిశోధకులు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా ఎక్స్ రే డిఫ్రాక్షన్(ఎక్స్ఆర్డీ) పద్ధతులలో శిక్షణ పట్ల వారు తమ సంతృప్తిని వ్యక్తం శారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లో విద్యా, పరిశోధన పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేశారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

**నర్సాపూర్, మార్చి 28, ప్రభాతవార్త :** పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధిత కుటుంబానికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన చుక్క నరేందర్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.15 వేల చెక్కును కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, సూరారం నర్సింలు, పట్టణ అధ్యక్షుడు పంబల్ల బిక్షపతి, మండల అధ్యక్షుడు భోగ శేఖర్, పంబల్ల రాంచెందర్, ఆంజనేయులు, సిద్ధిరాంరెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రసాద్, విఠల్‌గుప్త, ఆనంద్‌కుమార్, కృష్ణాగౌడ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# లేబర్‌కోడ్‌లు అమలులోకి వస్తే హక్కులు కోల్పోనున్న కార్మికులు

## ◆ మే 20న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి ◆ సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు

**పటాన్‌చెరు, మార్చి 28, ప్రభాతవార్త:**

లేబర్ కోడులు అమలులోకి వస్తే కార్మిక వర్గం, హక్కులు లేని కార్మిక వర్గంగా మిగిలిపోతుందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు అన్నారు. శుక్రవారం మండలంలోని పాశ మైలారం పారిశ్రామిక వాడ లో గల సువెన్ ఫార్మా పరిశ్రమ లో సిఐటియు యూనియన్ ఏర్పాటైన సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో చుక్క రాములు మాట్లాడుతూ కార్మికుల సమస్యలన్నీ సిఐటియు తోనే సాధ్యమని ఆయన అన్నారు కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మే 20వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె జరుగుతుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వము కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని కార్మికుల సమస్యలను రోజురోజుకు తీవ్రమవుతున్నాయన్నారు. లేబర్ కోడులు అమలులోకి వస్తే కార్మిక వర్గం హక్కులు లేని కార్మిక వర్గంగా మిగులుతుందని చెప్పారు. కార్మికుల శ్రమ దోపిడీ మరింత తీవ్రతరం అవుతుందని, కట్టు బానిసలుగా కార్మికులు మారతారన్నారు. మే 20 న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సువెన్ ఫార్మా కార్మిక సంఘం అధ్యక్షులు కే రాజయ్య, సిఐటియు జిల్లా నాయకులు పాండురంగా రెడ్డి, జనరల్ సెక్రెటరీ బిఎస్ రాజులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమ యూనియన్ నాయకులు వెంకటేష్, చంద్రయ్య, శ్రీనివాసు, చంద్రకాంత్, తలారి శ్రీనివాస్, సోమన్న, ఏడుకొండలు, శంకర్, రాజు, నాగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్కా రాములు

# జోగిపేట ఎక్సైజ్ అధికారి రూటే సెపరేటు..!

**హత్నూర మార్చి 28, ప్రభాతవార్త :**

ప్రభుత్వ చట్టాలను పరిరక్షిస్తూ ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారి నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉన్నారు. ఎక్సైజ్‌శాఖ అంటేనే లోపాలు, అవినీతికి మారుపేరుగా నిలిచిన శాఖ. రాబడులకు తగ్గట్టుగానే నిబంధనల ఉల్లంఘనతోపాటు మామూళ్లు జోరుగానే చేతులు మారుతుంటాయి. ఎవరైనా ఫిర్యాదుచేస్తే బాధితుడిపేరు గోప్యంగా ఉంచడం అటుంచి వారి పేర్లను కూడా బహిరంగపరుస్తున్న అధికారులు కూడా కోకొల్లలు. ఇదే తరహాలో జోగిపేట ఎక్సైజ్ అధికారి వ్యవహార శైలి కొనసాగుతోంది. ఆయన రూటే సపరేటు అన్న చందంగా ఉందని హత్నూర మండలంలోని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్టు షాపుల గురించి పట్టించుకోవడంలేదని, కల్లు షాపులు, డిపోల నిర్వహణ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోడని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించి సమాచారం ఇస్తే అస్సలు స్పందించడని, ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే రాతపూర్వకంగా వచ్చి తన వద్ద ఫిర్యాదు చేయాలంటూ తిప్పిపంపిస్తాడని అభియోగాలున్నాయి. ఫిర్యాదిదారులకి ఎదురు ప్రశ్నిస్తాడని, చట్టాన్ని ఉల్లంఘిస్తున్నవారికే జోగిపేట ఎక్సైజ్ అధికారి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్యాల గ్రామానికి ఇతర గ్రామాల నుంచి కల్లును సరఫరా చేస్తున్నారని ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్న ఇప్పటికీ స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈనెల 18న హత్నూర మండలం దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలో ఐదు లక్షల విలువైన అల్ప్రాజోలం, డైజోఫామ్‌ను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఇది కేవలం కల్లులో కలిపేందుకు వినియోగించే మత్తురసాయనం కావడంతో పట్టుకున్న అధికారులు తర్వాత ఏమందనేది ఎవరికీ అంతుబట్టడు. ఇది స్థానిక ఎక్సైజ్ అధికారుల పని తీరుకు నిదర్శనం అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనలు చాలా ఉంటాయని వాటిని అమలు చేయడం సాధ్యం కాదని, అదంతా కామన్ అన్నారు. కొన్యాల గ్రామస్తులు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అనుమతి లేకుండా డిపో నడుస్తున్నాయని ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పుకొచ్చారు.

# నాయిని జలాల్‌పూర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**కొల్చారం, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాయిని జలాల్‌పూర్ గ్రామంలో శుక్రవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయిని లక్ష్మయ్య, దాసు రాములు, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు కొప్పుల యేసు రాజు, నాయిని వెంకట్, నర్సింలు, బైండ్ల గంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం ఒకరి మృతి

## మరొకరికి తీవ్ర గాయాలు

**చౌటకూరు, మార్చి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రానికి సమీపంలో సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ కథనం ప్రకారం...సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన చాకలి నర్సింలు(55), భార్య జ్యోతి(50) టీవీస్ ఎక్సల్ లూనాపై జోగిపేట వెళుతున్న క్రమంలో చౌటకూరు సమీపంలో లూనా అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనగల కల్వర్టును ఢీకొంది. ప్రమాదంలో చాకలి నర్సింలు అక్కడికక్కడే మృతి చెందగా భార్య జ్యోతి తలకు తీవ్ర గాయాలకు గురవడంతో సంగారెడ్డిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమారులు,కుమార్తెలు ఉన్నారు.

### సహాయక చర్యలు చేపట్టిన జుక్కల్ ఎమ్మెల్యే...

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగిన సందర్భంగా హైదరాబాద్ నుంచి వాహనంలో జుక్కల్ వెళుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తన వాహనాన్ని ఆపి వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు.

# బావిలో శవాలై తేలిన వలస కార్మికులు

**జహీరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** కోహీర్ మండల పరిధిలోని పైడిగుమ్మల్ గ్రామంలో ఓ వెంచర్‌లో పనిచేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులు బైద్యనాథ్, ఒరిస్సాకు చెందిన హరిసింగ్ గ్రామంలోని వ్యవసాయ బావిలో శవాలై తేలారు. వ్యవసాయ బావిలో మృతదేహాలు ఉన్నట్లు తెలుసుకున్న ఎస్ఐ సతీష్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని బావిలో నుంచి శవాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ నెల 10వ తారీఖున కార్మికులు బైద్యనాథ్, హరిసింగ్‌లు అదృశ్యమైనట్లు పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసినట్లు ఎసై సతీష్ వివరించారు.

# మహిళ అదృశ్యం

**నర్సాపూర్ రూరల్, మార్చి 28, ప్రభాతవార్త:** ఆసుపత్రికని వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన మండల పరిధి మూసాపేట్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మూసాపేట్ గ్రామానికి చెందిన (జయరాంతండా) మెగావత్ భుజాలీ(52) కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈనెల 25 (మంగళవారం) నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఉదయం బయలుదేరింది. మధ్యాహ్నం కొడుకు కుమార్ భుజాలీకి ఫోన్‌చేయగా వస్తున్నానని చెప్పింది. సాయంత్రం మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని రావడంతో ఆందోళనకు గురైన కుమార్ తెలిసినవారివద్ద చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

**దుబ్బాక, మార్చి 28, ప్రభాతవార్త:** జల్సాలకు అలవాటు పడి డబ్బులు సంపాదించాలని అత్యాశతో మూగజీవాలను దొంగిలించి..విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న ఘటన దుబ్బాక పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది.సిఐ శ్రీనివాస్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 25న రాజక్కపేటలో నర్సింలుకు చెందిన ఒక ఎద్దు, 19న అప్పనపల్లిలో భాస్కర్‌కు చెందిన ఒక ఆవు కనబడడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ ప్రాంతాల్లో పలు నిఘా నేత్రాలన పరిశీలించగా దుబ్బాక పట్టణానికి చెందిన పెంటం శ్రావణ్, ఎడ్ల మహేష్ జల్సాలు అలవాటు పడి వ్యవసాయ పొలాల్లో కట్టి ఉంచిన ఆవును, ఎద్దును రాత్రిపూట వారి టాటా ఎసి వాహనంలో దొంగతనంగా ఎక్కించి చెల్లాపూర్ శివారులో ఒకచోట కట్టేసినట్లు తెలిపారు. వీరిద్దరికి చెల్లాపూర్ వార్డుకు చెందిన నవీన్ అనే మరొక యువకుడు సహాయం చేసినట్లు తెలిపారు. వీరు ఎత్తుకెళ్లిన మూగజీవాలను వివిధ అంగళ్లలో తెలిసిన వారికి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు గుర్తించి ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆవు, ఎద్దుతో పాటు టాటా ఎసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.సమావేశంలో ఎస్ఐ గంగరాజు, పీసీ రాంజీ తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుపుతున్న సిఐ



మాట్లాడుతున్న దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకీ చంద్రభాను

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

**కొండపాక, మార్చి 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దమ్మక్కపల్లి లో గురువారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు బాకీ చంద్రభాను డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దుద్దెడలో మాట్లాడుతే, దమ్మకపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సమంజసమైనది కాదని చట్టవిరుద్ధమైన చర్య అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని శిక్షించి మరో సారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో నరేందర్, మహేష్‌బాబు,కుమార్,శ్రావణ్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మక్కపల్లిని సందర్శించిన ఎసిపి, సిఐ



సంఘటన వివరాలన అడిగి తెలుసుకుంటున్న పోలీసు అధికారులు

**కొండపాక, మార్చి 28, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దమ్మక్కపల్లిలో భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహన్ని జింక తిరుపతి ధ్వంసం చేసిన విషయం తెలిసిందే!. ఈ క్రమంలో శుక్రవారం గజ్వేల్ ఎసిపి పురుషోత్తంరెడ్డి, తోగుట సిఐ లతీఫ్‌లు గ్రామాన్ని సందర్శించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ

**సిద్దిపేట అర్బన్, మార్చి 28, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ హయాంలో అప్పటి సిఎం కెసిఆర్ రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ అన్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 26వ వార్డులో శుక్రవారం కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ సొంత ఖర్చుతో పేద ముస్లింలకు రంజాన్ కిట్లనపంపిణీ కార్యక్రమంలో పాల్గొని రంజాన్ కిట్లను పంపిణి చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రంజాన్ తోఫాలను రాజకీయం చేసి పేద ముస్లింలకు అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రంజాన్ కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకలు వజీర్, మల్లేశం, లక్ష్మీనారాయణ, బాబా, మల్లారెడ్డి,సాయి తదితరులు పాల్గొన్నారు.

## పిట్టలకేరిలో ఇఫ్తార్ విందు

**సదాశివపేట, మార్చి 29, ప్రభాతవార్త:** పట్టణంలోని పిట్టల కేరిలో శుక్రవారం సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి(జగ్గారెడ్డి) ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు ముందు మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు (నమాజ్) చేసి ఇఫ్తార్ విందును స్వీకరించారు.

## రామాయంపేటలో బిసి పోరుగర్జన పోస్టర్ ఆవిష్కరణ



బిసి పోరుగర్జన గోడపత్రిక విడుదల చేస్తున్న సంక్షేమ సంఘం నేతలు

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 28, ప్రభాతవార్త :** బిసి రిజర్వేషన్ అమలుకోసం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన "హలో బీసీ...ఛలో ఢిల్లీ" కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం నాడు జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం ఆధ్వర్యంలో బీసీ పోరుగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా మెట్టు గంగారం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం చేసి, చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టి రిజర్వేషన్లు అమలుచేయాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 2వ తేదీన హలో బీసీ...ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆరోజు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద యావత్ బీసీలతో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన బీసీ పోరుగర్జన పోస్టర్‌ను ఈరోజు ఆవిష్కరించినట్లు తెలిపారు. బీసీ గర్జన కార్యక్రమానికి మెదక్ జిల్లానుండి పెద్దఎత్తున ఢిల్లీకి తరలివెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ నాయకులు పోచమ్మల గణేష్, సుంకోజు దామోదర్, మామిడి సిద్దరాములు, ఉమామహేశ్వర్, భూమ కిషన్, పచ్చంటి రాము, అల్లాడి వెంకటి, రెడ్డమైన నరేష్, పిట్ల శ్రీశైలంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మాచాపూర్‌లో ఘనంగా పొద్దుతిరుగుడు క్షేత్ర దినోత్సవం



పొద్దుతిరుగుడు పంటపై మెళుకువలను వివరిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, మార్చి 28,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాచాపూర్ రైతువేదికలో శుక్రవారం రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ పొద్దు తిరుగుడు క్షేత్ర దినోత్సవం పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొద్దుతిరుగుడు పంట యాజమాన్యం, మెళకువలు, నూనెగింగల ప్రాముఖ్యతను ఐసిఏఆర్ ఎల్ఎల్ఓర్ నందీశ్వర్, నిహారిక, అశోక్ రైతులకు వివరించారు. సమావేశంలో ఎఫ్‌పిఓ చైర్మన్ ఏలేటి వెంకటరెడ్డి, మాచాపూర్ ఏఈవో జమీల్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**నర్సాపూర్, మార్చి 28, ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకులు తొంట వినయ్ నాయనమ్మ, స్వర్గీయ తొంట వెంకటేష్ తల్లి తొంట రామమ్మ(95) శుక్రవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధితుల నివాసానికి వెళ్లి తొంట రామమ్మ మృతదేహానికి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. కాగా మధ్యాహ్నం అంత్యక్రియల్లో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి వెంట బారాసా సీనియర్ నాయకులు నయీంఉద్దీన్, సత్యంగౌడ్, సూరారం నర్సింలు, పట్టణ అధ్యక్షులు పంబల్ల బిక్షపతి, మండల అధ్యక్షులు భోగ శేఖర్, రాంచందర్, నాగరాజ్ గౌడ్, రింగుల ప్రసాద్, జగపతి, విఠల్ గుప్త,ఆనంద్ ఉన్నారు

# మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, మార్చి 28, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ పట్టణంలో రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా మున్సిపల్ సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగసంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణమున్సిపల్ సమావేశమందిరంలో కార్యాలయ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈసమీక్షాసమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటివసతికి సంబంధించిన వనరులను పటిష్టపరుచుకోవాలని కమిషనర్ సూచించారు. అదేవిధంగా బోర్లు రిపేరు ఉంటే వెంటనే వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్య పనుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, కాలనీలో డ్రైనేజీసమస్యపై ఎప్పటికప్పుడు స్పందించి చర్యలుచేపట్టాలన్నారు. దోమలబెడద లేకుండా ఫాగింగ్‌చేయాలని, ముఖ్యంగా వీధిదీపాల రూప కల్పనలో నిర్లక్ష్యంచేయకూడదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా వీధిదీపాలు ఏర్పాటుచేసుకోవాలని ఆదేశించారు. టియుఎఫ్ఐడిసి నిధులు మరో పదిరోజుల్లో వచ్చే అవకాశం ఉందని, వీటితో అన్ని పనులు పూర్తిచేసుకోవచ్చని సూచించారు. మున్సిపల్ సిబ్బంది కొరత అంశాన్ని ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. మున్సిపాలిటీకి వివిధపనులపై వచ్చే ప్రజలకు సిబ్బంది తగు సమాధానం చెప్పాలని, ముఖ్యంగా ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఎవరైనా అనుమానాలతో వస్తే వారికి నివృత్తిచేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలు అందించడంలో సిబ్బంది ముందుండాలని కోరారు. ఈసందర్భంగా కమిషనర్ సునీత మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాలమేరకు మున్సిపాలిటీలో సిబ్బంది అన్నివిధాల పనులు నిర్వహిస్తారని, ఎక్కడా అలసత్వం జరగదని వివరించారు.



ఎమ్మెల్యే శంకర్‌కు మొక్కను అందజేస్తున్న కమిషనర్ సునీత



ఔషధ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రతినిధులు

## విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సదస్సులు ఉపయోగపడతాయి

### అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

**నర్సాపూర్, మార్చి, 28 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసీ కళాశాలలో ఔషధ 2025 అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సులో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ తెలంగాణ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ ట్రాన్ జెన్ ట్ బయోటిక్ లిమిటెడ్ కె.కోటేశ్వరరావు, సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ యూఎస్ఏ డాక్టర్ నిఖిల్ పాతక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్రగ్ డెవలప్‌మెంట్, ఫార్మా లాజికల్ ఎఫెక్ట్స్ గురించి వివరంగా తెలియజేశారు. ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ ట్రాన్ జెన్ ట్ బయోటిక్ లిమిటెడ్ డాక్టర్ కె కోటేశ్వరరావు ఔషధాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలకు చెందిన 700 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వై ఫర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రమేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ కళాశాలల ప్రిన్సిపల్ లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ వస్తువుల్లో నాణ్యతా ప్రమాణాలు ముఖ్యం

**షాద్‌నగర్, మార్చి 28, ప్రభాతవార్త:**
విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలకోసం దూరంవెళ్లకుండా షాద్‌నగర్ పట్టణంలోని కనీవినీ ఎరుగనిరీతిలో షోరూంను ప్రారంభించడం విశేషమని, మంచి నాణ్యతాప్రమాణాలు పాటించి ఎలక్ట్రానిక్‌వస్తువులను ప్రజలకు అందజేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పరిగి రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ షోరూమ్‌ను ఎమ్మెల్యే శంకర్ చేతులమీదుగా ప్రారంభించారు. షోరూం అధినేత రాజ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి, కాంగ్రెస్ కార్యకర్త అశోక్ కుమార్రెకు ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. పట్టణంలో పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్ పరికరాల విక్రయాలకోసం పెద్దఎత్తున షోరూం ప్రారంభించడం విశేషమన్నారు. ప్రతి చిన్నవస్తువుకోసం హైదరాబాద్, ఇతరప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే అన్నిరకాల సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు మొక్కను అందజేశారు. ఈకార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య పాల్గొన్నారు.

## ఈద్గా దారిని కబ్జా చేశారని తహసీల్దార్‌కు ఫిర్యాదు

**షాబాద్, మార్చి 28 ప్రభాతవార్త :** షాబాద్‌లోని ఈద్గా రహదారిని కొందరు అక్రమంగా కబ్జాచేశారని ఆరోపిస్తూ శుక్రవారం తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగామైనార్టీ నాయకులు మాట్లాడుతూ ఈద్గా రహదారికి అడ్డంగా ఫ్రీకాస్ట్ వేసినవారిపై చట్టపరమైన చర్యలుతీసుకొని, దారిని విడిపించాల న్నారు. షాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 3 నుండి షాబాద్ ఈద్గాకు తాతలకాలం నుండి వెళ్లేవారమని తెలిపారు. ఈమధ్యన కొందరు అక్రమంగా దారికి అడ్డంగా ఫ్రీకాస్ట్‌వేసి కబ్జాచేశారని ఆరోపించారు. వెంటనే కబ్జాచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఈద్గాకు దారివెళ్లేలా చూడాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో మైనార్టీ నాయకులు మతిన్, అస్మత్ పాషా, మజీద్, షాహిద్, వాజీద్, ఉన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**నందిగామ, మార్చి 28, ప్రభాతవార్త:**
మండలకేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ రాజేశ్వర్ కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీచేశారు. మండలకేంద్రానికి చెందిన తుప్పుడు నర సమ్మ, పాత్లవత్ సుజాతలకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు.అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లెల్ల సుజాత, ఏకుల సుశీలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు, మాజీ ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ, కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మాజీసర్పంచ్ కావలి కృష్ణ, నాయకులు బొమ్మగల్ల నర్సింలు, శివగల్ల సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు దోమలో తైబజార్ వేలంపాట

**దోమ, మార్చి 28, ప్రభాతవార్త:**
నేడు(శనివారం) దోమ మండల కేంద్రములోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తైబజార్ వేలంపాట నిర్వహిస్తున్నట్లు దోమ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. దోమ గ్రామములో ఒక సంవత్సరము అంగడిబజార్‌లో (కూరగాయలమార్కెట్) సంత 01.04.2025 నుండి 31.03.2026 వరకు సంతలో కూరగాయలు ఇతర వస్తువులు అమ్మేందుకు వచ్చిన వారి దగ్గర టాక్స్ వసూలు చేసుకునేందుకు బహిరంగ వేలంపాట జరుగుతుందని తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనేవారు గ్రామ పంచాయతీకి బాకీలు ఉండాదని,3000 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని దోమ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు.

## వక్ఫ్ సవరణ బిల్లు ప్రజాస్వామ్యంపై దాడి

-షాద్‌నగర్‌లో ఆయా మసీదుల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన




షాద్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

**షాద్‌నగర్, మార్చి 28, ప్రభాతవార్త:**
కేంద్రం తీసుకువచ్చిన వక్ఫ్ (సవరణ) బిల్లును ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడిగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు పేర్కొంటుందని షాద్‌నగర్ పట్టణానికి చెందిన ముస్లిం నాయకులు హఫీజ్ అన్వర్, అలీమ్ షాకిబ్, హాజీ, ఫయాజ్ భాయ్, నయీం, ఇర్ఫాన్, యూసుఫ్ గోరి, పర్వేజ్, ఆసిఫ్, షాకీర్, షకీల్, తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం ఆల్ ఇండియా ముస్లిం పర్సపల్ లాబోర్డు పిలుపుమేరకు శుక్రవారం నమాజ్ ప్రార్ధనల అనంతరం ఆయా మసీదులవద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. వక్ఫ్ ప్రయోజనాల కోసం భూమిని ఎవరు దానం చేయవచ్చో నిర్ణయించడంపై ఉద్దేశపూర్వకంగా అస్పష్టత ఇచ్చారని, వక్ఫ్ నిర్వచనాన్నే మార్చారని వారు ఆరోపించారు. వక్ఫ్‌పాలనను బలహీనం చేసేందుకు ప్రస్తుతం ఉన్న చట్టంలోని నిబంధనలు తొలగించారని, వక్ఫ్‌భూములను ఆక్రమించినవారికి రక్షణకల్పించేలా మార్పులుచేశారని ఆరోపించారు.

## మానవ అక్రమ రవాణాపై అవగాహన

**జిల్లేడు చౌదరిగూడ, మార్చి 28, ప్రభాతవార్త:**



సమావేశంలో మాట్లాడుతున్న ఏపిఎం నర్సింహా

పేదరికాన్ని అడ్డుపెట్టుకుని కొంతమందిలో ఆశలు చెలరేపి మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఏపిఎం నర్సింహా అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండలకేంద్రంలోని మహిళాసమాఖ్య భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ అక్రమరవాణాపై మహిళలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అక్రమరవాణాకు గురైతే టోల్ ఫ్రీ నెం: 1930,100,104,1098,181 నెంబర్లకు ఫోన్‌చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు రమేష్, దేవయ్య, స్వర్ణలత, స్వరూపలున్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

**దుద్యాల్, మార్చి 28, ప్రభాతవార్త:**
ఇఫ్తార్‌విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని యాదవ హక్కుల పోరాటసమితి వికారాబాద్‌జిల్లా అధ్యక్షుడు పుర్ర పెంటయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం దుద్యాల మండలంలోని పోలేపల్లిలో రంజాన్ ఉపవాసదీక్షల సందర్భంగా ఆయన ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లింలు రంజాన్‌మాసాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. కులమతాలకు అతీతంగా పండుగల ు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో చెన్నయ్య, మునావర్, జహంగీర్, కరీం,యూసుఫ్, నరేష్ గౌడ్, ముస్తాక్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై సిసి కెమెరాలు

**శంషాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:**
హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు శంషాబాద్ ఇన్స్పెక్టర్ కట్ట నరేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక భారతీయజనతాపార్టీ నాయకుడు కొండ పరమేష్ గౌడ్ సొంతడబ్బులతో వీటిని ఏర్పాటుచేశారు. కెమెరాలను ఏర్పాటుచేసిన సందర్బంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న నేరాలను అరికట్టడంలో, నేరస్థులను గుర్తించడంలో సిసి కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయని అన్నారు. కాలనీలలో, బస్తీలలో, రహదారులపై సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ప్రజలను ఆయన కోరారు. తొండపల్లిలో సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకువచ్చిన పరమేష్‌గౌడ్‌ను ఆయన అభినందించారు. సిసి కెమెరాలు ఏర్పాటుచేయడం వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన సూచించారు. సిసి కెమెరాల దాత కొండ పరమేష్‌గౌడ్ మాట్లాడుతూ సిఐ నరేందర్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు నేరస్థుల సంచారాన్ని కనిపెట్టడంలో సిసి కెమెరాలు ఎంతో కీలకపాత్ర వహిస్తాయని ఆయన తెలిపారు. నేరాల నారికట్టడంలో పోలీసులకు సహకరించడానికి తానెప్పుడు ముందు ఉంటానని పరమేష్‌గౌడ్ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెదిరిపాటి సుధాకర్‌గౌడ్, దొడ్డ పెంటయ్య, కదిరిపాటి శేఖర్‌గౌడ్, రేనట్ల అశోక్‌గౌడ్, పోలేపల్లి సునీల్‌గౌడ్. కోడూరు సుఖేందర్, కొండా సుదర్శన్‌గౌడ్, సిద్ధులు నర్సింగ్. దామోదర్ గౌడ్(చంటి) రాజు పాల్గొన్నారు.

# ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ

-జిల్లావ్యాప్తంగా పంపిణీకి సన్నాహాలు చేస్తున్న అధికార యంత్రాగం

**మేడ్చల్‌జిల్లా ప్రతినిధి, మార్చి 28, ప్రభాతవార్త:**
ఉగాదిపండుగను పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యాన్ని అందించటానికి నిర్ణయించటంతో జిల్లా అధికారయంత్రాంగం దీనికిసంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధంచేస్తుంది. ఉగాదిపండుగ రోజున రేషన్‌షాపులద్వారా రేషన్‌కార్డు ఉన్న లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీచేయటానికి ఇప్పటికే అధికార యంత్రాంగం అప్రమత్తంచేసి రేషన్‌డీలర్లతో, గోడౌన్ల ఇన్‌చార్జిలతో, కాంట్రాక్టర్లతో సన్నబియ్యంను అందించటానికి రేషన్‌షాపులకు ముందుగానే సరఫరాచేయటానికి ఆధికారికంగా చర్యలు చేపట్టింది. వీరు ఇప్పటివరకు రేషన్‌షాపుల ద్వారా రేషన్‌కార్డుదారులు దొడ్డుబియ్యంను పొందటం జరుగుతోంది. అయితే ఇక ఉగాదిపండుగ నుంచి సన్నబియ్యంను పొందనున్నారు. రేషన్‌షాపులద్వారా రేషన్‌కార్డు (బిపిఎల్)వారికి అందించటంజరుగుతుంది. అయితే ఇకనుంచి దొడ్డుబియ్యంకు బదులుగా సన్నబియ్యంను ప్రభుత్వం పంపిణీచేయనుంది. దీనికి సంబంధించి జిల్లావ్యాప్తంగా అధికారయంత్రాంగం రేషన్ షాపులద్వారా సన్నబియ్యంను పంపిణీ చేయటానికి అన్నీ సిద్ధంచేస్తుంది.



అమ్మవారికి బోనాల ఊరేగింపు దృశ్యం

## అంగరంగ వైభవంగా దుర్గమ్మ తల్లికి బోనాలు

**పెద్దశంకరంపేట, మార్చి 28 ప్రభాతవార్త:** దుర్గమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు శుక్రవారం అమ్మవారికి అంగరంగ వైభవంగా బోనాలను సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసిన అనంతరం మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించారు. ఉదయం వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు భాజా భజంత్రీలతో శివ సత్తుల నృత్యాలతో బోనాలు నెత్తిన పెట్టుకొని శ్రీసరస్వతి శిశు మందిర్(దేవిడి) వద్దకు చేరుకోగా అక్కడి నుండి ఊరేగింపుగా దుర్గమ్మ తల్లి దేవాలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. అలాగే మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, గ్రామ పెద్దలు, వేణు గోపాల్‌గౌడ్, మురళి పంతులు, కనకరాజు, ఆర్ఎన్. సంతోష్ కుమార్, కందుకూరి రవీందర్, దాదిగారి గంగాధర్, రాజన్ గౌడ్, నర్సింలు చారి, సంతోష్ కుమార్, సీతారామారావు, సతీష్ గౌడ్, సర్వేశ్వర్, రవి వర్మ, బీరప్ప, యువకులు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కొనసాగిన బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి

**గుమ్మడిదల, మార్చి 28 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెంలో కొలువై ఉన్న సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయని ఆలయకమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి తెలిపారు. వారం రోజులుగా జరిగిన స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కలను తీర్చుకున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకర్షించాయని తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, గీతాలాపనలు, అగ్నిగుండాలు, రథోత్సవం నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవో శశిధరుప్తా, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, రవీంద్రమూర్తి, ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సురభి నాగేందర్‌గౌడ్, సద్ది విజయభాస్కర్ రెడ్డి, ధర్మకర్తలు పూజారి కృష్ణ, భాస్కర్ గౌడ్, అశోక్, ఆలయ వతాన్‌దారులు ఆలేటి జగన్మోహన్ రెడ్డి, రోహిత్ రెడ్డి, ముక్కాల వెంకన్న గుప్తా, గటాటి రవి, రమేష్, నర్సింగరావు పంతులు, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న పూజల హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, మార్చి 28,ప్రభాతవార్త :** కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు ముస్లింల సంక్షేమానికి కృతనిశ్చయంతో పనిచేస్తుందని ఆపార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గాలో శుక్రవారం ప్రభుత్వం అధికారికంగా ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. రంజాన్ పండుగను ముస్లింలు సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) పార్టీ నాయకులు మహేందర్, సాకి అనంద్, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మీ, సాంబమూర్తి, గయాజుద్దీన్, రాజ్‌బహుదూర్‌రెడ్డి, ఎర్ర మహేందర్, వహీద్‌ఖాన్, వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : డాక్టర్ కిరణ్

**నర్సాపూర్, మార్చి 28, ప్రభాతవార్త :** విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ ఎస్.కిరణ్ అన్నారు. శుక్రవారం రెడ్డిపల్లి గ్రామంలో జాతీయ సేవాపథకం, ఒయు విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌వన్ ఆధ్వర్యంలో శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం 6వ రోజు ఆరోగ్య శిబిరం నిర్వహించి వ్యక్తిగత ఆరోగ్య శుభ్రత పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, డాక్టర్ రాహుల్, డాక్టర్ స్నేహ పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఇతరులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్ కుమార్, శ్రీనివాస్, రమేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## నేడు ఆమనగల్లులో బిసి కమిషన్ పర్యటన

**ఆమనగల్లు, మార్చి 28 ప్రభాతవార్త :** రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్, సభ్యులు శనివారం ఆమనగల్లులో పర్యటించనున్నట్లు తహసీల్దార్ సిహెచ్. లలిత తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీలో పర్యటించి అక్కడ నివసిస్తున్న వీరముష్టి, వీరభద్రయ్య కులమువారితో వారు సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారని ఆమె వివరించారు. వీరముష్టి, వీర భద్రయ్య కులాల వారి జీవనవిధానం, స్థితిగతులపై అధ్యయనం చేస్తారని ఆమె తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన ఆవుల రాజిరెడ్డి

**నర్సాపూర్, మార్చి 28, ప్రభాతవార్త :** నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి ఇటీవల గుండె శస్త్ర చికిత్స జరిగి హైదరాబాదులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ టి పి సి సి ప్రధాన కార్యదర్శి ,నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తన పుట్టినరోజును పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఆవుల రాజిరెడ్డి పుట్టినరోజు సందర్భంగామాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఆవుల రాజిరెడ్డికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి. రాయలపురం మాజీ సర్పంచ్ శేకులు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన ఆవుల రాజిరెడ్డి తదితరులు



ఏడాకులపల్లిలో అమావాస్యకు ముస్తాబైన సప్తగిరి శనిఘాట్

## శని అమావాస్యకు ముస్తాబైన సప్తగిరి శని ఘాట్

**ఝరాసంగం, మార్చి 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఏడాకుల పల్లిలో సప్తగిరి శనిఘాట్ ఈనెల 29న శని అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులచే పూజలందుకునేందుకు ముస్తాబయ్యాడు. శని ఘాట్‌లో కొలువున్న శనైశ్వరుడిని దర్శించుకునేందుకు సంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాలతోపాటు కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహిస్తూ ఉంటారు. ఆలయంలో నిత్య పూజలతో పాటు శని మహా యజ్ఞం, 1108 కులశములతో తైలాభిషేకం, భక్తులచే స్వయంగా అభిషేకాలు చేసుకునేందుకు తగు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటి బాధ్యులు పేర్కొన్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు (అన్నదానం) ఏర్పాటు చేశారు.

## శివ పంచముఖి ఆలయంలో నగర్ సంకీర్తన

**సదాశివపేట, మార్చి 29, ప్రభాతవార్త:** పట్టణంలోని శివ పంచముఖి హనుమాన్ ఆలయంలో శుక్రవారం ఉదయం నగర సంకీర్తన నిర్వహించారు. పట్టణంలోని శ్రీచెన్న బసవేశ్వర ఆలయం నుంచి పాటలు ఆలపిస్తూ, భజనలు చేస్తూ ప్రారంభమైన నగర సంకీర్తన జైన, భూలక్ష్మమ్మ, నల్ల పోచమ్మ ఆలయాల మీదుగా శివ పంచముఖి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శర్మ, సంగప్ప, అధ్యక్షులు వెంకటాపురం సత్యనారాయణ, చంద్రసేన, హితేందర్, మల్లన్న, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, నర్సింలు, హనుమాన్, జీవన్, ఆంజనేయులు, గణేష్, సురేష్, వీరేశం, భక్తులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ. 6 లక్షలు



నల్ల పోచమ్మ ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

**మనూర్, మార్చి 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువుండి భక్తులచే నిత్య పూజలందుకుంటున్న శ్రీనల్లపోమ్మ ఆలయ హుండీని శుక్రవారం దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివారాజ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ శంకరయ్య పర్యవేక్షణలో లెక్కించగా రూ. 6,17,878 ఆదాయం సమకూరిందని ఇఓ శివరుద్రప్ప తెలిపారు. 8 నెలల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు మొక్కుబడిలోభాగంగా అమ్మవారికి నగదు రూపంలో సమర్పించుకున్న ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, అర్చకులు సిద్దుస్వామి శ్రీకాంత్‌స్వామి, నాగేష్ స్వామి, ప్రవీణ్‌స్వామి పాల్గొన్నారు.

## మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు



చౌటకూరు మజీదులో ప్రార్థనలు చేసుకుంటున్న ముస్లింలు

**చౌటకూరు, మార్చి 28, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లోని మసీదులు ప్రత్యేక ప్రార్థనలతో సందడిగా మారాయి. రంజాన్ మాసం చివరి శుక్రవారం (అల్విద జుమ్మ)ను పురస్కరించుకుని ముస్లింలు మజీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 27 రోజులుగా ఉపావాస దీక్షలతో గడిపిన ముస్లింలు అల్విద జుమ్మను పురస్కరించుకుని ఒక చోటుకు చేరుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పేద ముస్లింలకు నూతన వస్త్రాలు, కిరాణా సామాగ్రి పంపిణి చేసేందుకు తగు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

## భారత సైనంలోకి ఏడుగురి ఎంపిక



భారత సైన్యంలోకి ఎంపికైన ఏడుగురిని అభినందిస్తున్న దృశ్యం

**మనూర్, మార్చి 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాయిపల్లిలో ఎస్‌బిఐ ఫౌండేషన్, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న యూత్ ట్రెనింగ్ కేంద్రంలో శిక్షణ అందుకున్న ఏడుగురు( పాండు, బాలాజీ, జ్ఞానేశ్వర్, గౌతమ్, దీపక్, మహేష్, హన్మంతు) భారత సైన్యం లో సేవలిందించేందుకు ఎంపికయ్యారు. భారత సైన్యంలో ఎంపికైన ఏడుగురిని భవిష్య భారత్ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ, మాజీ లెఫ్టినెంట్ జనరల్ హరిప్రసాద్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్మీ ర్యాలీలో పాల్గొలనుకునే వారు ఏప్రిల్ 10వ తేదీ లోపు ధరఖాస్తు చేసుకోవాలని హరిప్రసాద్ సూచించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు మంచి శిక్షణ ఇస్తూ భారత సైన్యంలో ఎంపికయ్యేలా కృషి సల్పుతున్న శిక్షణ కేంద్రం హెడ్ కోచ్ జగ్జీత్ సిర్ ఆసద్, బహీర్‌లను, శిక్షకులకు సహకరిస్తున్న గ్రామస్థులకు, అభ్యర్థులకు హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

## అల్లాదుర్గం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

### -అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి ఎన్నిక

**అల్లాదుర్గం, మార్చి 29, ప్రభాతవార్త:** అల్లాదుర్గం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పిజె విఠల్‌రెడ్డిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అల్లాదుర్గం కోర్టులో న్యాయవాదులు సమావేశమై బార్ అసోసియేషన్ కమిటిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వెంకటకృష్ణ, కోశాధికారిగా ప్రభు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వెంకట్‌రాంరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ బాధ్యులను న్యాయవాదులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



అల్లాదుర్గం కోర్టు బార్ అసోసియేషన్ నూతన కమిటీ

# రైతులకు రుణమాఫీని బేషరతుగా అమలు చేయాలి

### బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**సంగారెడ్డి అర్బన్, మార్చి 28 ప్రభాతవార్త:** మెదక్ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం బీజేపీ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈకార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా 2 లక్షల రుణమాఫీని వెంటనే బేషరతుగా చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ. 20,650 కోట్లు మాత్రమే రైతు రుణ మాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. రైతు భరోసా ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటివరకు 355 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతుల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం కరెంట్ సరిగ్గా ఇవ్వక పోవడంతో పంటలు ఎండుతున్నాయని, రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల మీద కాంగ్రెస్ పార్టీకి, బిఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆ ఫ్యాక్టరీలను తెరిపించాలేదని అన్నారు. వెంటనే ఆ ఫ్యాక్టరీలను ఓపెన్ చేయాలని డిమాండు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ అని చెప్పి మోసం చేసిందన్నారు. యాసంగి ధాన్యం కోనేందుకు ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి త్వరితగతిన ధాన్యాన్ని తూకం వేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి





మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

## ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ గడపాలి

### -జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

**మెదక్ అర్బన్, మార్చి 28 ప్రభావార్త :** సుదీర్ఘకాలం పోలీసు వ్యవస్థకు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఏఆర్ ఎస్ఐ శ్రీహరిని కుటుంబ సమేతంగా జిల్లా పోలీసు కార్యాలయానికి ఆహ్వానించి పదవీ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మొదటగా కుటుంబ సభ్యుల సమక్షంలో శ్రీహరి దంపతులకు జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పూలమాలలు, శాలువాలతో సత్కరించి బహుమతి ప్రదానంచేసి అభినందించారు. ఎలాంటి రిమార్కులు లేకుండా సర్వీసును పూర్తి చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రంగ నాయక్, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శైలెందర్, ఏవో మణి, వాళ్య నాయక్, కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కంగ్టి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

### -సిపిఐ జిల్లా నాయకులు చిరంజీవి

**నారాయఖేడ్, మార్చి 28 ప్రభాతవార్త:** జర్నలిస్టులను కంగ్టి తహశీల్దార్ కార్యాలయంలోకి రావద్దు అంటూ పోస్టర్‌ను అతికించిన తహశీల్దార్, అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు చిరంజీవి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగానికి నాలుగో స్తంభంగా పనిచేస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి పోస్టర్ అతికించడం సరైన పద్ధతి కాదన్నారు. తక్షణమే పై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజాన్ని నిర్భయంగా బయట పెట్టే జర్నలిస్టులను ఇలా అవమానించడం మంచిది కాదన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నది జర్నలిస్టులే అన్నారు.

## మామిడి మొక్కలను పరిశీలించిన అధికారులు



న్యాల్‌కల్‌లో మామిడి మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న అడిషినల్ డిఆర్‌డిఓ

**న్యాల్‌కల్, మార్చి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మామిడి మొక్కల పెంపకాన్ని, అత్నూర్ గ్రామంలో నిర్మించిన పశువుల షెడ్డును శుక్రవారం అడిషన్ డిఆర్‌డిఓ బాలరాజు పరిశీలించారు. మామిడి మొక్కల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతుకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధి హామి ఏపిఓ రంగారావు ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్‌లు ఉన్నారు.

## విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలి : ఎస్ఐ

**మర్కుక్, మార్చి 28 (ప్రభాతవార్త):** విద్యార్థినిలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ముందస్తు కార్యాచరణ ఎంతో అవసరమని ఎస్ఐ దామోదర్ సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోగల కెజిబివి పాఠశాలలో విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమని, భవిష్యత్తు అభివృద్ధి కోసం ఎంతో జాగ్రత్తగా ముందుకు సాగాలని తెలిపారు. మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, షీటీమ్, పలు చట్టాలపై, సైబర్ నేరాల పట్ల అవ గాహన కలిగి వుండాలని సూచించారు. చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావద్దని, విద్య పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుకోవాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే మంచి స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. నూతన చట్టాలతో మహిళల రక్షణకు పెద్దపీట వేయడంతో పాటు నేరం చేసిన నేరస్థులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళలు, పిల్లలను ఎవరైనా హేళనకు గురిచేస్తే 100కు, లేదా 8712667343, 8712667435కి సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ లావణ్య, మహేష్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎస్ఐ దామోదర్





చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి

## ఆర్యవైశ్యులకు ప్రభుత్వం పెద్దపీట

### -కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, మార్చి 28 (ప్రభాతవార్త):** సామాజిక సేవలో ఆర్యవైశ్యుల సేవలు వెలకట్టలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమన్నారు. ప్రతి అమావాస్య అన్నదాన కార్యక్రమాలు, అంబలి పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాసవీ క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌ను అభినందించారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, ఇందుకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. వైశ్యుల బలోపేతం కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గజ్వేల్ ఆర్యవైశ్యులు సామాజిక సేవలో, రాజకీయాల్లో మరింత రాణించాలన్నారు. పేద ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, ఏఎంసి డైరెక్టర్లు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మహంకాళి శ్రీనివాస్‌గుప్త, ఏఎంసి డైరెక్టర్ డాక్టర్ వాహిద్, ఉప్పల మెట్టయ్య, వాసవీ క్లబ్ ప్రధాన కార్యదర్శి సిద్ది నవీన్‌గుప్త, నాచగిరి ఆలయ మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపిపి లక్ష్మయ్యగుప్త, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోలి సంతోష్‌గుప్త, పురోహితుడు రాజశేఖరశర్మ, నాయకులు సమీర్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, కొమురవెల్లి శంకరయ్య, కైలాస ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి అశోక్‌కుమార్, గంగిశెట్టి గిరిధర్, నేతి శ్రీనివాస్‌గుప్త, అత్తెల్లి శ్రీనివాస్, గౌరిశంకర్, గంగిశెట్టి వెంకటేశం, ఉమేష్, కైలాస ప్రశాంత్, రాము, గంగాధర్, జగ్గయ్యగారి శ్రీహరి, గంగ రమేష్ పాల్గొన్నారు.

## మనూర్‌లో అంబలి పంపిణీ

**మనూర్, మార్చి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శుక్రవారం జిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జపు మచ్చేందర్ సూచనల మేరకు అంబలిని పంపిణి చేశామని ప్రతినిధులు పరశురాంరెడ్డి, శ్రీనివాస్, బి.తుకారాం, అభిపవార్, అనిల్ కుమార్, దత్తు, అశోక్‌రెడ్డి, వీరారెడ్డి, హుటెల్ మల్గొండ, యాదుల్ పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

**మర్కుక్, మార్చి 28 (ప్రభాతవార్త):** శ్రీ ఆంజనేయస్వామి జన్మ నక్షత్రం పూర్వాభద్ర నక్షత్రం పురస్కరించుకొని మర్కుక్‌లో మాధవ్‌శర్మ, కార్తిక్ పంతులు ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయస్వామికి శుక్రవారం పంచామృతాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా జరిగే అభిషేక కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు తెలిపారు. స్వామివారి జన్మ నక్షత్రం రోజున దర్శించుకొని పూజలు చేస్తే అనుకున్నది నెరవేరుతుందని అన్నారు.

## మెగా వైద్య క్యాంపు విజయవంతం

**శివ్వంపేట, మార్చ్ 28 (ప్రభాతవార్త) :** గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అజయ్‌మిశ్రా వెల్లడించారు. శుక్రవారం శివంపేట మండలం దొంతి గ్రామంలో తుప్రాన్ వియస్‌టి ఇండస్ట్రీస్ సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.. తూప్రాన్‌లోని వియస్‌టి ఇండస్ట్రీస్ సహకారంతో దొంతిలో క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగం శ్రీనివాసరావు, జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, మెగా వైద్య క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కాగా దొంతి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య మెగా క్యాంపుకు ప్రజల నుండి మంచి స్పందన లభించింది. శివంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లతోపాటు, మల్లారెడ్డి ఆసుపత్రికి చెందిన డాక్టర్లు, డెంటల్ డాక్టర్లు శిబిరములో పాల్గొని పేషెంట్లకు వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, జిల్లా కోశాధికారి డిజి శ్రీనివాస్‌శర్మ, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి, మద్దెల సత్యం, దామోదర్ రావు, తోట శ్రీనివాస్, మద్దెల రమేష్, సతీష్, మాజీ జెడ్పిటిసి లక్ష్మీ కాంతారావు, గ్రామ కార్యదర్శి శంకర్‌గౌడ్, మల్లవరం భాస్కర్ రెడ్డి, గిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.



హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా

# మొరాయిస్తున్న రెవెన్యూ సైట్..

### ఇష్టం వచ్చినట్లు దోచుకుంటున్న మీ సేవ నిర్వాహకులు.. చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**కొల్చారం, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన యువకులు, ప్రజలు నిత్యం మీ సేవ కేంద్రాలకు వెళుతూ వస్తూ ఉంటారు. అక్కడ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు మేరకు డబ్బులు తీసుకోరు. వారికి ఇష్టం వచ్చినట్లు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ప్రజలను సతాయిస్తున్నారు. ఇటీవల రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రకటించడంతో పెద్ద ఎత్తున యువత, ప్రజలు, మహిళలు భారీ సంఖ్యలో మీసేవ కేంద్రాలకు వద్దకు వెళ్లి కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేశారు. నియమ నిబంధన ప్రకారం మూడు సర్టిఫికెట్‌లకు కలిపి రూ. 135 అవుతాయి. కానీ ఒక దరఖాస్తుదారుడి నుంచి రూ. 200 పైగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 20 రోజులు గడుస్తున్నా సర్టిఫికెట్లు రాకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. వచ్చే నెల 5వ తేదీ చివరి తేదీ కావడంతో తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ రావడం లేదని అధికారులు చేతులెత్తేశారు. దీంతో తాము ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ గఫార్ మియాను వివరణ కోరగా.. ఒక సర్టిఫికెట్‌కు రూ. 45 మాత్రమే చెల్లించాలని నిబంధనలు ఉన్నా, ప్రజలు ఎందుకు డబ్బులు ఎక్కువగా ఇస్తున్నారని, ఈ విషయం వారికి తెలియక పోవడం బాధాకరం అన్నారు. ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్న మీసేవ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అందరిని కూర్చోబెట్టి మాట్లాడి ఇలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తామని తెలిపారు.



వెండికోల్‌లో పగిలిపోయిన మిషన్ భగీరథ పైన్‌లైన్ దృశ్యం

## వెండికోల్‌లో పగిలిన పైప్‌లైన్

### -పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు

**చౌటకూరు, మార్చి 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెండికోల్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయి నీరు వృధాగా పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. హుస్నాపూర్ నీటి శుద్ధి కేంద్రం నుంచి వెంకటకిష్టాపూర్ గ్రామంమీదుగా వెండికోల్ గ్రామానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్ నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. గ్రామ శివారులోని పెద్దగుండు వద్ద గురువారం రాత్రికి పైప్‌లైన్ పగిలిపోయింది. వాటర్‌ట్యాంక్‌లకు సరఫరా అయ్యే పైప్‌లైన్ పగిలిపోవడంతో శుక్రవారం గ్రామస్థులు మిషన్ భగీరథ నీటికి నోచుకోలేక అనేక ప్రాయాసాలకు గురయ్యారు. గ్రామస్థులు పైల్‌లైన్ పగిలిన విషయాన్ని సంబంధిత అధికారులకు వెన్నవించి వెంటనే మరమ్మత్తులు చేయాలని వినతి చేశారు.

## ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ల జోలికి పోవద్దు : ఎస్ఐ

**పాపన్నపేట, మార్చి 29, ప్రభాతవార్త:** ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌ల జోలికిపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ ప్రజలకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు ఠాణాలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్ ప్రమాదకరమని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలకు, బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

## కళ్యాణలక్ష్మితో పేదల జీవితాల్లో వెలుగులు

**చౌటకూరు, మార్చి 29,ప్రభాతవార్త:** కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులతో పేదల జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయని జోగిపేట ఏఎంసి చైర్మన్‌జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. చౌటకూరులోని రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్‌తో కలిసి ఆయా గ్రామాలకు చెందిన 18 మందికి కళ్యాణలక్ష్మి, ముగ్గురికి షాదీముబారక్ చెక్కులను (1లక్ష116 చొప్పున 21 లక్షల 02వేల 436 రూపాయలు) అందచేశారు. అర్హులైన వారు వివాహం అయిన వెంటనే ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నె కిరన్‌కుమార్, ఆర్ఐ రాజు, నాయకులు ఈశ్వర్‌గౌడ్, మహి పాల్‌రెడ్డి, రామచంద్రారెడి, పార్కల రాంరెడ్డి, గోవర్ధన్, రామాగౌడ్, కౌసర్, మల్లారెడ్డి, రాములు, శ్రీహరి, ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్, లింగారెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్

**నారాయణఖేడ్, మార్చి 28 ప్రభాతవార్త:** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ సతీమణి ఉమాదేవి సురేష్ కుమార్ షెట్కార్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ కోటగిరి మండల్‌కు చెందిన కుమ్మరి అనురాధకు అత్యవసర చికిత్స నిమిత్తంఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ ఆదేశాల మేరకు సీఎం సహాయ నిధి నుండి మంజూరైనా 3 లక్షల రూపాయల ఎల్‌వోసీ చెక్కను ఎంపీ సతీమణి ఉమాదేవి సురేష్ కుమార్ షెట్కార్ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పుడు నిరుపేదలకు అండగా నిలుస్తుందని అన్నారు.

## హనుమాన్ దేవాలయానికి సౌండ్ సిస్టం అందజేత

**గుమ్మడిదల, మార్చి 28 ప్రభాతవార్త:** కానుకుంట గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో సౌండ్ సిస్టం లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతుండటంతో సమాచారం తెలుసుకొని స్థానిక యువకులు బిజెపి సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, కానుకుంట గ్రామ మాజీ ఉప సర్పంచి పలుగు గోవర్ధన్ రెడ్డితో వివరించడం జరిగింది. వారు వెంటనే స్పందించి సౌండ్ సిస్టం పరికరాలు (ఆంప్లిఫైర్, పుంగీలు, మోత్ పీస్) దేవాలయానికి బహుమతిగా అందజేశారు. అడిగిన వెంటనే పెద్ద మనసుతో వారు అందించిన ఈ సహాయానికి ఆలయ నిర్వాహకులు గోవర్ధన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జల మాధవరెడ్డి, తలారి ప్రవీణ్ కుమార్, పలుగు సంజీవరెడ్డి, సామల అంజిరెడ్డి, సామల వెంకటరెడ్డి, సోమోల యాదగిరి, జంగాల అనిల్ రెడ్డి, గడ్డం వినయ్, తోటపల్లి సాయిరాం రెడ్డి, జురు కుమార్, గంజి నవీన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పశు గణన

**పెద్దశంకరంపేట, మార్చి 28 ప్రభాతవార్త:** మండలంలో పశు గణన కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో పశు గణన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి నిజాం హుస్సేన్ మాట్లాడుతూ రైతులు పశువుల వివరాలను పశువైద్య సిబ్బంది వద్ద నమోదు చేయించాలన్నారు. వేసవిలో పశువులు, కోళ్ల రోగాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పౌల్ట్రీ యజమానులకు, రైతులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభం

**పెద్దశంకరంపేట, మార్చి 28 ప్రభాతవార్త:** వేసవిలో చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంవద్ద తహశీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉపాధి కూలీలకు అంబలి పంపిణీ

**నారాయణఖేడ్, మార్చి 28 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని తుర్కపల్లి గ్రామంలో జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ ఆదేశాల మేరకు శుక్రవారం అంబలి పంపిణీ చేశారు. జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్, టీంసభ్యులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు అంబలే అమృతంగా పని చేస్తుందన్నారు. ఎండాకాలంలో వడదెబ్బ తట్టుకోవడానికి అంబలి కొంత మేరకు సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి విద్య కమిటీ చైర్మన్ విఠల్ గౌడ్, జ్ఞానేశ్వర్, తాజా మాజీ ఉప సర్పంచి సాయి రెడ్డి, దుర్గగౌడ్, గైని మల్లేశం, జిఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు పారశురాం రెడ్డి, శ్రీనివాస్, బి. తుకారాం, అబి పవార్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

## పెద్దచెల్మెడలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**మునిపల్లి, మార్చి 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దచెల్మెడ గ్రామంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సొసైటీ చైర్మన్ పద్మదర్గయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి శనగలు తీసుకువచ్చే రైతులు 14 శాతం లోపు తేమ ఉండేట్లు చూసుకోవాలన్నారు. క్వింటాలు శనగలకు 5650 రూపాయలను రైతులు అందుకుంటారన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకాలను తీసుకురావాలన్నారు. మండలంలోని ప్రతి రైతు సాగు చేసిన శనగలను దళారులకు అమ్ముకుని ఆగం కాకుండా కొనుగోలు కేంద్రానికి తరలించి లబ్దిపొందాలన చైర్మన్ పద్మదుర్గయ్య రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజలి, విస్తీర్ణ అధికారులు లావణ్య, నిఖిత, అంజన్న, సొసైటీ డైరెక్టర్లు సంగన్న, సంజీవరెడ్డి, విశ్వనాథం, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.





పెద్దచెల్మెడలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పద్మదుర్గయ్య